క్లుప్తంగా

సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు

● మాజీ మంత్రి దయాకర్‌రావు



పాలకుర్తి టౌన్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభకు తరలివచ్చి విజయవంతం చేయడంలో భాగస్వాములైన నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సభ విజయవంతం కోసం సహకరించిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

హర్షణీయం

దేవరుప్పుల: తెలంగాణ పౌర సమాజ విజ్ఞప్తి మేరకు ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి పారామిలిటరీ బలగాలను వెనక్కి పంపి, వెంటనే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ డిమాండ్ హర్షణీయమని ఉస్మానియా జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలో మోహరించిన తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులను సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి రప్పించి ప్రజాపాలనకు తీరును నిరూపించుకోవాలన్నారు. కర్రెగుట్టల్లో ప్రాణనష్టానికి రేవంత్‌రెడ్డి సర్కారు బాధ్యత వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరిపేదాకా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రతిపక్షాలు అంకితభావంతో పాటుపడాలని కోరారు.

ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, కృష్ణ

జఫర్‌గఢ్: మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నాయిని రామస్వామి, కాట కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేశ్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన సంఘం మండల సదస్సులో ఆయా గ్రామాలకు చెందిన 11 మంది మత్స్యకారులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన నాయిని రామస్వామి సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కాగా జఫర్‌గఢ్ గ్రామానికి చెందిన కాట కృష్ణ సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా అన్నెపు రమేష్ (రఘునాథ్‌పల్లి), నీల నరసయ్య (తమ్మడపల్లి (ఐ), శాగ యాదగిరి (కూనూర్) సహాయ కార్యదర్శులుగా యాతం శ్రీను (తిమ్మాపూర్), గోరంతల సతీష్ (తీగారం), సింగారపు రాజు (కోనాయిచలం), కోశాధికారిగా చెన్నూరి పాపయ్య (తిడుగు) ఉన్నారు.

పునాదులకే పరిమితం



మోడల్ హౌస్ కోసం తీసిన పునాదులు

చిల్పూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్‌ల నిర్మాణాలను ప్రతీ మండల కేంద్రంలో నిర్మించి లబ్ధిదారులకు చూపించాలంటూ ఆదేశాలను జారీ చేసింది. దీంతో మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నెల రోజుల క్రితం హౌంజింగ్ బోర్డు అధికారులు పునాదులు తీసి వదిలేశారు. ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టక పోవడంతో పునాదుల్లో మట్టి కూరుకుపోతోంది. అధికారులు స్పందించి మోడల్ హౌజ్ నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కార్మికులు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న వెంకటేశ్

బచ్చన్నపేట: కార్మికులు అందరూ సంఘటితమై సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఇంజ ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గం అమెరికా దేశంలో చికాగో నగరంలో పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేఖంగా పని రోజులు తగ్గించాలని ఆనాడు ఐక్యంగా చేసిన పోరాట ఫలితమే మేడే అని అన్నారు. మేడే ఉత్సవాలను హమాలీ, భవన నిర్మాణ, ఆటో, బీడీ, వ్యవసాయ రంగ కార్మికులు సంఘటితంగా జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ అన్నెబోయిన రాజు, అశోక్, మనోహర్, సుధాకర్, ఐలయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఉపాధి హామీ బాట

● పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే లక్ష్యం
● బడిబాటలో భాగంగా ఇంటింటికి టీచర్లు



ఉపాధిపనుల వద్ద సర్కార్ బడిలో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న టీచర్లు

రఘునాథపల్లి: ఉపాధ్యాయులు ఉపాధి హామీ పనుల బాట పట్టారు. అదేంటి..? అనుకుంటున్నారా..? మీరు చదివింది నిజమే.. పిల్లలను చదివించండి.. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ బడిబాటలో భాగంగా తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. మండలంలోని ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటికి వెళ్తున్నారు. సోమవారం మాదారం ఊర్లోకి వెళ్లిన ఉపాధ్యాయులకు ఇళ్ల వద్ద ఎవరూ కనిపంచలేదు. స్థానికంగా ఆరా తీస్తే వేసవి నేపథ్యంలో ఉదయమే ఉపాధి హామీ పనులకు వెళ్లారని తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు గ్రామ శివారులో పని చేస్తున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. పిల్లలకు చదువు, ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలలో విద్యా విధానం, అనుభవం, అర్హత ఉన్న ఉపాధ్యాయుల బోధనా తీరును వారికి వివరించారు. పనికి ఆహార పథకం, ఇతరత్రా పనులు చేసి కష్టపడి సంపాదించిన డబ్బులను చదువు పేరిట ప్రైవేట్ విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన అవసరం లేదని, సర్కారీ పాఠశాలలో ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందని చెప్పారు. గత సంవత్సరం 10వ తరగతిలో వచ్చిన ఫలితాలు, విద్యార్థుల మార్కులను వివరించి ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కలిగించారు. దీంతో కొందరు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. నలుగురు పిల్లల తల్లిదండ్రులు అడ్మిషన్ తీసుకునేందుకే అక్కడే సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 40 మందికి అడ్మిషన్ ఇచ్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ భారత రవీందర్, ఉపాధ్యాయులు సరాబు వీరన్న, శాగ నర్సయ్య, డాక్టర్ కె శ్రీనివాస్‌రెడ్డి, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం

● ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన కంఠమహేశ్వరస్వామి-సురమాంబదేవి, శ్రీరేణుకా ఎల్లమ్మ-జమదగ్ని మహర్షి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ గుడి వద్ద కల్యాణ మహోత్సవాలను రెండు రోజుల నుంచి అంగరంగ వైభవంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి గౌడ కులస్తులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకుడు బొర్ర హరికిషన్ వేదమంత్రాల మధ్య చేపట్టిన కల్యాణ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జలబిందెలతో ఎల్లమ్మతల్లి విగ్రహానికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకాలు చేపట్టారు. రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణ ఉత్సవాలతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పూజల్లో దేవాలయ కమిటీ అధ్యక్షుడు చట్ల బుక్‌స్టాల్ యాకయ్యగౌడ్, కార్యదర్శి పల్లె రవీందర్ గౌడ్, గౌడ కులస్థులు, భక్తులు మందపురం ఎల్లగౌడ్, గండి విజయలక్ష్మీ, కుర్ర ఉప్పలయ్య, చట్ల యాకయ్య, యాదగిరి, రమణ, రాజ్‌కుమార్, మందపురం అంజయ్య, పల్లె లక్ష్మీనారాయణ, రామగోని సతీష్, ప్రభాకర్ తదితర గౌడ కులస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పోషకాల లోపం లేకుండా చూడాలి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్ : విద్యార్థుల్లో పోషకాల లోపం లేకుండా చూడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన 'పోషణ పక్షం' ముగింపు కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ బోధన చాలా మెరుగు పడిందని, నమోదు కాని వారు స్వయంగా వెబ్‌సైట్ ద్వారా వివరాలు సమర్పించి దగ్గరలోని అంగన్వాడీ కేంద్రాలలో నమోదు కావచ్చని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఉన్నంత పర్యవేక్షణ ప్రయివేట్‌లో లేదని, పోషకాహారం ఇవ్వడంతో పాటు ఉన్నతమైన విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే దొరుకుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న గర్భిణులకు కలెక్టర్ దంపతులు రిజ్వాన్ బాషా, సయ్యద్ అఫ్రీన్ చేతుల మీదుగా సామూహిక శ్రీమంతం, 6 నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రాసన, ప్రీ ప్రైమరీ స్కూల్‌లోని మూడు నుంచి ఆరేళ్ల వయసు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అలాగే 9 మంది దివ్యాంగులకు ఆర్థిక ప్రోత్సాహం కింద ఒక్కొక్కరికి రూ.50,000 చొప్పున చెక్కులు అందజేశారు. ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ యాక్ట్ కింద జిల్లాలో దరఖాస్తు చేసుకున్న ఏడుగురికి గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్ ఇచ్చారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్, జిల్లా చేనేత, జౌలి శాఖ అధికారి చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

నర్మెట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని దివ్యాగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పాతూరి ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పాతూరి సుగుణమ్మ కోరారు. మండల కేంద్రంలో సోమవారం మాట్లాడారు. మొదటి లిస్టులో వచ్చిన పేర్లు చివరి లిస్టులో తొలగించారని, కూలిపోయిన గోడలపై టార్పాలిన్ కప్పులతో నివాసముంటున్న, రేకుల పూరింటిలో ఉంటున్నవారి పేర్లు సైతం తొలగించారని అన్నారు. అనర్హులకు ఇళ్లు కేటాయించడం సరికాదని, అధికారులు తక్షణం స్పందించి గూడు, నీడలేని పేదలకు న్యాయంచేయాలని తెలిపారు. లేని పక్షంలో సీపీఐ వారి పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన గాదెపాక కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం కాంగ్రెస్ మండల నాయకుడు ఎడవెల్లి సోంమల్లయ్య బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేశారు. డాక్టర్ గద్దల యాకసోమయ్య, ఎడవెల్లి వెంకటేశ్వర్లు, ఎడవెల్లి సునీల్ మహాజన్, గాదెపాక భాస్కర్ తదితరులు ఉన్నారు.

'కేసీఆర్ ప్రసంగం పేలవం'



మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి

జనగామ రూరల్: ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగం పేలవంగా ఉందని పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు రోజూ చెప్పే అబద్ధాలే మాట్లాడారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాహసంతో ఎస్సీ వర్గీకరణ బిల్లు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టి, బిల్లును ఆమోదింప చేశారని తెలిపారు. బీసీల కులగణన, సన్న బియ్యం పంపిణీ అమలు ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. డీసీసీ జాయింట్ సెక్రటరీ గౌలుసుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

జనగామ రూరల్: మే 6వ తేదీన వైశాక శుద్ధ నవమిన వరంగల్ భద్రకాళీ దేవాలయంలో నిర్వహించే అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కమిటీకి నిర్వాహణ కమిటీ బాధ్యులు, దాతలు నాగవెల్లి సురేష్, రమేష్, నరేందర్ సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. కల్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అభినాష్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగెల శ్రీరాం, ప్రధాన కార్యదర్శి గజ్వెల్లి రఘుపతి, కోశాధికారి ప్రశాంత్, జిల్లా ముఖ్యనాయకులు వెంకటేష్, లక్ష్మీనారాయణ, విజయ్, రాందయాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆక్యుప్రెషర్ థెరపీ శిబిరం ప్రారంభం



క్యాంపులో పాల్గొన్న క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: వాసవీ వనిత ప్లాటినం క్లబ్ స్టేషన్ ఘన్‌పూర్ వారి ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో సోమవారం ఆక్యుప్రెషర్ థెరపీ ట్రీట్‌మెంట్ క్యాంపు (నాచురోపతి శిబిరం) ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గన్ను కళావతి, ప్రధాన కార్యదర్శి పోకల మంజుల మాట్లాడారు. క్యాంపు మే 2వ తేదీ వరకు నిర్వహించబడుతుందని, ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. ఆక్యుప్రెషర్ థెరపీ ద్వారా మెడ నొప్పి, గుండె సమస్యలు, తల నొప్పి, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, అసిడిటీ, మోకాళ్ల, నడుము, తుంటి నొప్పులు, నిద్రలేమి, అధిక బరువు, థైరాయిడ్ తదితర ఎన్నో సమస్యలకు చికిత్స చేస్తారన్నారు. అనుభవజ్ఞులైన థెరపిస్టులతో చికిత్స ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వాసవీ వనిత ప్లాటినం క్లబ్ కోశాధికారి గన్ను జయలలిత, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం చైర్మన్ గన్ను నర్సింహులు, బిక్షపతి, రవీందర్, వరూధిని, అనూజ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న విజేందర్

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి విజేందర్

జనగామ రూరల్: మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఏసిరెడ్డి నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశం కల్లెపు కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విజేందర్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరస్తూ.. ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలపై మోయలేని భారాలు వేస్తుందన్నారు. దళిత, గిరిజనులకు రక్షణ లేకుండా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పాలన నిరసిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు ప్రకాశ్, కర్రె శంకర్, మేడ ఆనందం, గుండె మల్లేష్, నరేష్, బొల్లం దయాసాగర్, తాళ్లపల్లి సైదులు, ఎండి మైబెళ్లి, గణిపాక భిక్షపతి, నాగవల్లి రవి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేసింది ఏమీలేదు

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 16 నెలల పాలనలో ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని, అట్టర్‌ప్లాప్ సీఎంగా రేవంత్‌రెడ్డి నిలిచారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు అమలుకు నోచుకోని హామీలు చేసి ప్రజలను మభ్యపెట్టారన్నారు. 2004కు ముందు టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో కడియం శ్రీహరి ఎన్‌కౌంటర్లకు ఆజ్యం పోశారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం పాత పద్ధతినే అవలంభిస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ సభ సక్సెస్‌తో జోష్

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, అంచనాలకు మించి బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు తరలి వచ్చారని, గులాబీ బాస్ ప్రసంగంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన జోష్ వచ్చిందన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి 30వేల మంది తరలివచ్చారని అన్నారు.

కర్రిగుట్టలో కాల్పులు నిలిపివేయాలి

చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులోని కర్రిగుట్టలో కేంద్ర బలగాలు కాల్పులను నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం కక్ష్యపూరితంగా ఎన్‌కౌంటర్లు చేయిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీలు మారపాక రవి, కీర్తి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయికి మొక్కులు చెల్లిస్తున్న స్థానికులు

దేవరుప్పుల: దుష్టశక్తులు, ప్రకృతి కోపాల నుంచి కాపాడే సర్వదేవతల స్వరూపంగా కొలిచే దేవరుప్పుల గ్రామ బొడ్రాయి వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. వేదబ్రాహ్మణులు ఉప్పల రమేష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా దేశగురువు హాజరై ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకు పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తిగౌడ్ రూ.3.50 లక్షల విరాళంతో ఉత్సవం పదహారు పండుగతో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బొడ్రాయి ఉత్సవాల నిర్వహణకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జీపీ ఉద్యోగులు

బచ్చన్నపేట: జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మండల కేంద్రంలో జీపీ ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సోమవారం అమరవీరుల స్తూపం వద్ద నుంచి ప్రధాన వీధుల గుండా నినాదాలను చేస్తూ ర్యాలీని తీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు నాగయ్య, శ్రీనివాస్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్'



మాట్లాడుతున్న యాకయ్య

పాలకుర్తి టౌన్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో తెలంగాణ కోసం ఉద్యమించిన ఉద్యమకారులు ప్రొఫెసర్ జయశంకర్, మలిదశ తొలి అమరుడు శ్రీకాంత్‌చారిని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ విస్మరించారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొలుగూరి యాకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి జీర్ణించుకోలేక కేసీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకలు నలమాస రమేష్,సంగి వెంకన్న, అనుముల అంజీరావు, నారగోని ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవాలు



పూజ చేస్తున్న అర్చకులు

చిల్పూరు: మల్కాపూర్ గ్రామంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న దుర్గామాత ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అర్చకుల వేద మంత్రాల నడుమ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

నివాళి



జనగామ రూరల్: పట్టణ కేంద్రంలోని ధర్మకంచకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పానుగంటి ప్రవీణ్ సోమవారం ఉదయం ఉరేసుకొని మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రవీణ్ ఇంటికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత సభ్యులను పరామర్శించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

రఘునాథపల్లి: మద్యం తాగి వాహనం నడిపిన మండలంలోని ఎర్రగడ్డతండాకు చెందిన ఇస్లావత్ రాజుకు సోమవారం జనగామ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రామనర్సయ్య జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన రాజు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా కానిస్టేబుల్ సాయికృష్ణ సోమవారం కోర్టులో ప్రవేశపర్చగా జడ్జి ఒక రోజు జైలు శిక్షతో పాటు, రూ.వెయ్యి జరిమానా వేశారని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఎస్సై హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం..



నివాళులర్పిస్తున్న ఝాన్సీరెడ్డి తదితరులు

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ కోసం విస్తృత సేవలందించిన గుగులోత్ సుధాకర్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. సోమవారం పడమటితండా(పెద్దతండా) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ సుధాకర్ మృతి చెందగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరామ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు, సజ్జన్, గణేష్, దావెర అనిల్, రాజేందర్‌నాయక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

సుధాకర్ మృతి పట్ల పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ప్రకాష్, మహేందర్‌జీ. సోమనర్సోజీ, రమేష్, శేఖర్, అబ్దుల్, ప్రవీణ్, యాద, రవీందర్, నర్సింహ, వీరన్న, యాకన్న ఉన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

● గోవర్ధనగిరిలో ఘటన



ప్రేమలత (ఫైల్)

రఘునాథపల్లి : భర్త వేధింపులు తాళలేక భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గోవర్ధనగిరిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలువేరు వెంకటయ్య-ఎల్లమ్మ దంపతుల కూతురు ప్రేమలత (25) అదే గ్రామానికి చెందిన కాగితోజు రాజు ప్రేమించుకోగా.. నాలుగేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. వీరికి మూడేళ్ల కుమార్తె జాన్విక, ఏడు నెలల బాబు ఉన్నారు. కొన్నేళ్లుగా భార్య భర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం భార్యతో గొడవపడి చితకబాదాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రేమలత ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన భర్త వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సూచనతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ప్రేమలత మృతితో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.